# విజ్ఞుడు

"ఛీ!" అనుకున్నాడు అప్పారావు.

కొందరు అనుకున్న మాటల్లా పైకి అనెయ్యలేరు ఒక్కొక్కప్పుడు!

అలాగే అప్పారావూ అనలేదు. అనలేడు కూడా.

అందుకని...

అసహ్యంతో మొహం ప్రక్కకి త్రిప్పుకున్నాడు.

కాని...కాని...

అరెరే...అదేమిటి? అక్కడ ఆ ప్రక్కన కూర్చున్న వాడు కూడా వీడిలాగే...

పల్లెటూరి రైతులా...

రెండోక్లాసు కుర్రవెధవలా...!

ఆరోగ్యసూత్రాలేమీ తెలియని మూర్ఖుడిలా...

వాడూ వీడిలాగే ప్లేటులోనే చేయి కడుక్కుంటున్నాడు.

దోసెలో నంజుకోగా మిగిలిన కాస్త పచ్చడి చేతిలోకి తీసికొని, వ్రేళ్ళసందున నలిపి చేతికంటుకున్న నూనె వదిలించుకుని మరీ కడుక్కుంటున్నాడు.

"ఛీ! అనుకున్నాడు అప్పారావు మళ్ళీ. వాణ్ణీ, తనెదురుగా కూర్చుని జేబురుమాలుతో చేయి తుడుచుకుంటూ తృప్తిగా త్రేనుస్తున్న వీణ్ణీ చూస్తూ.

అయితే ఇందాకటంత గట్టిగా అనుకోలేదు అప్పారావు.

మాసిన పొట్టినిక్కరూ, బనియనూ తొడుక్కుని జిడ్డోడుతున్న కుర్రాడొకడు వచ్చి ఆ నీళ్ళతో నిండిన ప్లేట్లు తీసి, టేబుల్ కడిగి లోపలికి పోతున్నాడు.

వాడు టేబుల్ కడగడాని కుపయోగించిన గుడ్డను చూస్తేనే డోకు వచ్చేట్టుందనుకున్నాడు అప్పారావు.

కాని, ఎప్పుడూ అనుకున్నట్లు జరగనట్టుగానే ఇప్పుడూ అప్పా రావుకు డోకు రాలేదు.

"ఎబ్బె ! ఏం మనుషులు వీళ్ళు ?" అనుకున్నాడు అప్పారావు. ఆ హోటల్లో తింటూ త్రాగుతూ వున్న వాళ్ళలో తనని తప్ప అందర్నీ కలియజూస్తూ.

"వీళ్ళకేం తాము చేస్తున్న పని మంచిదికాదని తోచదా. వీళ్ళింత మూర్ఖులా !" అనుకున్నాడు అప్పారావు.

అలా అనుకోవటంలో తాను వాళ్ళందరికన్నా ఓ మెట్టు పైనున్న ట్లనిపించింది అప్పారావుకు.

ఈ ప్లేట్లు తీసుకెళ్ళిన కుర్రాడు వాటిమీద ఓ నాలుగు చుక్కల నీళ్ళు జల్లి ఆహాఁ ఎంత బాగా శుభ్రం చేశాను అనుకుంటాడు. అనుకుని, వాటిని సర్వరు కందిస్తాడు. వాడందులో ఓ దోసో, రెండిడ్లీలోవేసి తన బోటివాళ్ళ ముందుంచుతాడు. తామేమో లొట్టలు వేసుకుంటూ మింగి ఊరుకుంటారు మడ్డి సంగతీ, జిడ్డు సంగతీ చూడకుండానే.

హోటలు వాడిమీద అమాంతం కోపం ముంచుకొచ్చింది అప్పా రావుకు.

అయినా వీళ్ళకు బుద్ధి లేకపోతే వాడికన్నా ఉండనక్కరలేదా.

అందరూ వీళ్ళలాంటి వాళ్ళేనా ? తన బోటి వాళ్ళు లేరా ?

ఆ సంగతి వాడు గమనించవద్దా ?

అనుకుంటూనే తలెత్తేడు అప్పారావు.

గోడమీది బోర్డును చూసి ఉలిక్కిపడ్డాడు అప్పారావు.

"దయచేసి ప్లేట్లలో చేతులు కడగకండి."

హోటలువాడిని అనవసరంగా తిట్టుకున్నందుకు తన మీద తనకే జాలివేసింది అప్పారావుకు. పాపం వాడి తప్పేంలేదు. వీళ్ళకే, యీ తిని, త్రాగేవాళ్ళకి బుద్ధిలేదు. లేకపోతే గోడమీద ఆ బోర్డు అంతగా మొత్తు కుంటున్నా వినకుండా, చూడకుండా యీ గలీజేమిటి ?

సర్వారు తెచ్చి ముందుంచిన ప్లేటులోని దోసెలోంచి వేడి ఆవిరి మొహాన తగలటంతో ఆలోచనలు ఆగిపోయాయి అప్పారావుకు.

దోసె చాలా రుచిగా ఉందనుకున్నాడు ఆకలిగా ఉన్న అప్పారావు మూడు ముక్కలు నమిలాక.

అయినా అయ్యరుగాడు వండటమూ అవి బాగుండక పోవడమూ ఏమిటి ? ఇడ్లీ వండితే వాడే వండాలి. దోసె చేస్తే వాడే చెయ్యాలి. "వింటే భాగవతమే వినాలి. తింటే అయ్యరిడ్లీయే తినాల"ని సామెత ఊరికే పుట్టిందా మరి. అందుకే వందల మైళ్ళు దాటివచ్చినా ఇక్కడ యిలా హాయిగా టేబుల్‌ముందు కూర్చుని రెండు చేతులా రెండు జేబులా కూడా సంపాదిస్తున్నాడు.

అయ్యరు అదృష్టాన్ని మెచ్చుకుంటూ దోసె తినటం ముగించి, కాఫీకి ఆర్డరిచ్చి వాషింగ్ బేసిన్ వైపు నడిచేడు అప్పారావు.

వాషింగ్ బేసిన్‌ను సమీపిస్తూ "నో అడ్మిషన్ !" బోర్డుక్రిందున్న ద్వారంగుండా కనిపించిన దృశ్యాన్ని చూసి మళ్ళీ "ఛీ !" అనుకున్నాడు అప్పారావు.

లోపలంతా నల్లగోడలూ, మురికి మనుషులూ, పొగతో నిండిన గాలి.

తా నిందాక తిన్న దోసె యీ కూపంలోనేనా తయారయింది ? తాను త్రాగబోతున్న కాఫీ యీ మురికిలోనేనా తయారవుతున్నది ? అప్పా రావు మనస్సు చివుక్కుమన్నది.

మొహం త్రిప్పుకుని బేసిన్‌వద్దకు చేరుకుని అందులో చేయిపెట్టి పంపు త్రిప్పేడు అప్పారావు. కాని అందులోంచి నీళ్ళు రాలేదు. రెండో వైపునున్న పంపు త్రిప్పేడు. అదీ అంతే.

విసుగ్గా కోపంగా కౌంటరుముందున్న అయ్యరు వంక చూసేడు కాని అయ్యరు దృష్టి యిటులేదు. బిల్లులు చూసుకుంటూ చిల్లర డబ్బు లెక్కపెట్టుకుంటున్నాడు తాపీగా.

యథాస్థానానికొచ్చి కూర్చుని అప్పుడే ప్లేటూ, గ్లాసూతీసి టేబుల్ శుభ్రం చేయబోతున్న కుర్రాడి నాపి గ్లాసులో మిగిలిన కాసిని నీళ్ళతో ఆ ప్లేటులోనే చేయి కడుక్కుని కాఫీ త్రాగేశాడు అప్పారావు.

కాఫీ చాలా రుచిగా వుంది. కాఫీ ఇలా వుండాలని తాను ఇంట్లో ఎన్నిసార్లు చెప్పినా లాభం లేకపోయింది. ఇంట్లో త్రాగుతున్నపుడు అసలు కాఫీ త్రాగుతున్నట్లే ఉండదు తనకు. ఏదో వెలితిగానే ఉంటుం దెప్పుడూ.

బహుశా యీ హోటలువాళ్ళ దగ్గరేదో చిట్కా ఉండి ఉండాలి

కథా నిలయం
759

లేకపోతే ఇంత రుచి ఎలా వస్తుంది!

అప్పారావు లేచి బిల్లు చెల్లించి బయటికివచ్చి పాన్‌షాపు వైపు నడిచేడు.

పాన్‌షాపు ముందు మూగిన వాళ్ళలోంచి సందుచేసుకుని పాన్‌కు ఆర్డరిచ్చి యధాలాపంగా పాన్ కట్టేవాణ్ణీ, వాడు కడుతున్న తీరూ చూసి గతుక్కుమన్నాడు అప్పారావు.

వాడు పాన్ నములుతూ బాసింపట్టు వేసుక్కూర్చుని ముందు పరచిన గుడ్డమీద ఆకులు పరచి ఒక్కసారిగా అరడజను పానులు చకచకా తయారుచేస్తున్నాడు.

అయితే అప్పారావు గతుక్కుమన్నది వాడి పద్మాసనా నైపుణ్యాన్నిగాని, అతగాడు పెదవుల మధ్య నృత్యం చేస్తున్న పాన్ తాలూకు రక్తంలాంటి నురగనుగాని చూసికాదు.

వాడు ఆకులు పరచిన గుడ్డను చూసి "ఛీ!" అనుకున్నాడు అప్పారావు.

వాడా గుడ్డను ఎన్నాళ్ళనుంచి వాడుతున్నాడోగాని అది సగం ఎర్రగా, సగం నల్లగా అలుముకుపోయి ప్రస్తుత స్థితిలో చూట్టానికది మసిపాతలా వుంది.

అయితే అప్పారావు "ఛీ" అనుకున్నది ఆ గుడ్డ అంత అందంగా ఉండటాన్ని చూసి భరించలేకగాదు.

మరో క్షణంలో తన నోట్లోకి పోబోతున్న పాన్ ఆ గుడ్డమీద తయారవటాన్నే సహించలేక పోయేడు అప్పారావు.

పాన్‌కోసం మూగిన నలుగుర్నీ పరకాయించేడు. వాళ్ళెవరూ ఆ

సంగతి గమనించినట్టేలేరు. కళ్ళు తెరుచుకు చూస్తూనే మురికిని మ్రింగటానికి సిద్ధపడుతున్నారు వీళ్ళు.

ఎబ్బే ఏం మనుషులు! అనుకున్నాడు అప్పారావు.

అలా అనుకోవటంతో "వెధవ పాన్! వేసుకోకపోతేనేమి! వెళ్ళిపోదామా" అనిపించింది.

కాని, అంతకుముందే డబ్బు వాడి ఎదాన కొట్టిన సంగతి గుర్తుకొచ్చి ఆగిపోయేడు.

వెధవది, తాను ముందుగానే డబ్బెందు కివ్వాలి! ఇప్పుడు పాన్ అక్కర్లేదు యిచ్చెయ్యమంటే పిచ్చాణ్ణి చూసినట్లు చూస్తారు నలుగురూ. ఇప్పుడు మర్యాదగా ఆ పాన్ పుచ్చుకుని తర్వాత ఏ చెత్తకుండీలోనో పడేస్తే సరి!'' అనుకున్నాడు అప్పారావు.

అనుకుంటూనే షాపువాడందించిన పాన్ పుచ్చుకుని నాలుగడుగులు ముందుకు వేసేడు.

"గుడీవ్నింగ్!" అంటూ ఎదురయ్యేడు స్నేహితుడు సూర్యనారాయణ చేయి చాపుతూ.

చేయందించబోయి చేతిలోని పాన్‌ను చూసి దాన్నే అందించబోయేడు అప్పారావు.

"ఎబ్బే! నాకు అలవాటులేదు. అయినా పాన్ అలవాటు వంటికి మంచిదిగా దంటారు. దానివల్ల గుండెజబ్బు వచ్చే అవకాశముందటగా!" అన్నాడు సూర్యనారాయణ.

అని చేతిలోని బరువైన సంచీని పట్టుకోమని అప్పారావు కిచ్చి జేబులోంచి సిగరెట్టు తీసి ముట్టించేడు.

సూర్యనారాయణ మాటలకు మండుకొచ్చింది అప్పారావుకు.

పీడి టొంద! కాకపోతే సిగరెట్లలో అమృతముంది కాబోల్ను! అదిమాత్రం గుండెలకు బలంగాబోల్ను, అనుకుంటూనే చేతిలోని పాన్‌ను నోట్లో వేసుకుని సూర్యనారాయణనే నమిలివేస్తున్నట్లు పరపరా నమల సాగేడు.

"ఏమిటి కబుర్లు?" ప్రశ్నించేడు సూర్యనారాయణ.

"ఏముంది! ప్రపంచమంతా అధ్వాన్నంగా తగలడుతూంది!" అన్నాడు అప్పారావు. పాన్‌నూ, పాన్ షాపువాణ్ణీ, హోటలువాణ్ణీ నెమరువేస్తూ.

"అవును. తగలడుతూంది!" వంత పలికాడు సూర్యనారాయణ. "ఈ సంచీలో చూడు." అన్నాడు.

ప్రపంచం ఇందులోనే తగలడుతూందేమో ననుకుంటూ సంచీలోకి చూసిన అప్పారావుకు అందులో తెల్లగా, తియ్యగా మెరుస్తూన్న పంచదార తప్ప మరేం అగుపించలేదు.

"ఏముంది! పంచదార." అన్నాడు అప్పారావు, సంచీని సూర్యనారాయణకు అందిస్తూ.

"అవును. పంచదారే! ఇంత తెల్ల వస్తువుకూడా నల్ల మార్కెట్లో తప్ప దొరకటంలేదు. ఇప్పుడక్కణ్ణుంచే కొనుక్కొస్తున్నాను. అంటే ప్రపంచం ఎంత నల్లగా తగలడుతూందో ఆలోచించు." అన్నాడు సూర్యనారాయణ.

అని, "ఇలా ఎక్కడికి బయలుదేరేవు?" అని ప్రశ్నించేడు అప్పారావుని.

''ఎబ్బే! అలా కాస్త సినిమా చూసొద్దామని.'' నసిగేడు అప్పా రావు. వీడుకూడా వస్తానంటాడేమోనని భయపడుతూ.

''కాస్తేం ఖర్మ! పూర్తిగా చూడు. టైమయిపోతున్నట్టుంది. త్వరగా వెళ్ళు నాకుమార్కెట్లో పనుంది వెళ్ళాలి!'' అంటూ వెళ్ళిపోయేడు సూర్యనారాయణ.

"వెధవ!" అనుకున్నాడు అప్పారావు. పూర్తిగా చూడాలట. ఆ సంగతి వీడు చెప్పాలి గాబోల్ను! అయినా వీడిలాంటి చవటలుండబట్టే పంచదారలాంటి తెల్ల వస్తువులుకూడా నల్లమార్కెట్లోకి జారుకుంటు న్నాయి. లేకపోతే ఓ వారంపాటు కాఫీ మానుకోగూడదూ! అప్పుడు పంచదారా, దాని తాతా కూడా తెల్లమార్కెట్లోకి రాకేం చేస్తాయి! అసలు బ్లాక్ మార్కెట్లోకానే వీడిలాంటి మనుషులే ఆ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తు న్నారు. ఛీ! ఛీ!... ఎబ్బెబ్బే! ఏం మనుషులు!

అనుకుంటూనే థియేటరువద్దకు చేరుకుని వాచీ చూసుకున్నాడు అప్పారావు.

టైం దాటిపోయిం దనుకుంటూ బుకింగ్‌వద్దకు వెళ్ళి మూసివున్న కిటికీచూసి తెల్లబోయాడు.

ఫస్టు క్లాసు బుకింగ్ మాత్రం తెరిచివుంది.

జేబులు తడుముకొని తనదగ్గర అంత డబ్బులేదని తేల్చుకున్నాడు అప్పారావు.

అప్పారావుకు అమాంతంగా సూర్యనారాయణమీదా, వాడి నల్ల మార్కెటు కబుర్లమీదా కోపం ముంచుకువచ్చింది.

వెధవ! వాడు దార్లో ఎదురవకపోతే ఇంత ఆలస్యం జరక్క పోను!

అయినా కొత్త పిక్చరు, జనం బాగా ఉంటారని తెలిసికూడా కాస్త ముందుగా బయలుదేరాల్సింది తను. కాని...కాని... ఎబ్బే! తన తప్పేం లేదు. తాను సకాలానికే బయలు దేరాడు. కాని, ఆ సూర్యనారాయణ గాడివల్లనే... ఆ నల్ల మార్కెట్ ప్రోత్సాహకుడివల్లనే తనకీ ఆలస్యమూ, ఆశాభంగమూను.

మండుతున్న కోపంతో యెదురుగా లేని సూర్యనారాయణను ఏం చెయ్యటానికీ వీలులేక నోట్లోని పానును మరింత గట్టిగా నమిలి తుపుక్కున ఊసి ఇంటిముఖం పట్టేడు అప్పారావు.

కాళ్ళీడ్చుకుంటూ బయటికి నడుస్తున్న అప్పారావుకు "టిక్కెట్ కావాలాండీ!" అన్నమాట సూర్యనారాయణ సంచిలోని పంచదారలా తియ్యగా తోచి వెనక్కి తిరిగేడు.

"సెకండుక్లాసు టిక్కెట్టుసార్! అంటూ చేతిలో టిక్కెట్టు ఆడిస్తూ నిల్చున్నాడు ఒకడు.

"ఎంత!" అనడిగేడు అప్పారావు సందేహంగా.

"ఓ అర్ధ రూపాయి ఎక్కువిస్తే చాలు సార్! బుక్కింగ్ మూసేశారుగదాండీ! ఇదే ఆఖరు టిక్కెట్టు" అన్నాడు వాడు టిక్కెట్టు చూపుతూ.

క్షణమాగి ఆలోచించాడు అప్పారావు.

ఆలోచిస్తూ దీపాల క్రింద మెరుస్తూన్న రంగు రంగుల పోష్టర్లలోని రంగు రంగుల తారల మొహాల్ని పరికించేడు.

పరికించి మారు మాట్లాడకుండా జేబులోంచి డబ్బు తీసిచ్చి టిక్కెట్టు పుచ్చుకున్నాడు.

పుచ్చుకుని ఠీవిగా, దర్జాగా థియేటర్లోకి నడిచేడు అప్పారావు.

★